సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



వెలంపేటలో చెరువును తలపిస్తున్న రోడ్డు (ఇన్‌సెట్) బీచ్‌రోడ్డులో కోతకు గురైన తీరం

వర్షం ఆగి.. వెతలు మిగిలి 8లో



డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మిని సోమవారం సినీ నటుడు సాయికుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికి వారిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు.

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన బార్ కౌన్సిల్ సభ్యులు



జస్టిస్ తుహిన్ కుమార్‌తో రాష్ట్ర బార్ కౌన్సిల్ ప్రతినిధులు

విశాఖ లీగల్: రాష్ట్ర హైకోర్టు నూతన న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్ కుమార్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సీనియర్ సభ్యుడు పి.నర్సింగరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ వసతి గృహంలో జస్టిస్ తుహిన్ కుమార్‌తో పలు అంశాలపై వారు చర్చించారు. రాష్ట్రంలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న వివిధ అంశాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లారు.

నలుగురు ఎస్‌ఐలకు స్థానచలనం

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఎస్‌ఐగా ఉన్న బి.తిరుపతిరావును భీమిలి ట్రాఫిక్‌కు అటాచ్ చేశారు. భీమిలి ట్రాఫిక్ ఎస్‌ఐ సి.హెచ్.చిరంజీవిని ఎంవీపీ ట్రాఫిక్‌కు, అక్కడ ఉన్న వి.కనకారావును ఆరిలోవ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. ఆరిలోవ ట్రాఫిక్‌లో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఎల్.మురళీకృష్ణను సీసీఆర్‌బీకి పంపించారు.

లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారానికి కృషి

విశాఖ లీగల్: పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. సోమవారం ఆయన జాతీయ న్యాయ సేవాధికారం సంస్థ, ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా జ్యుడీషియల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను గుర్తించి కక్షిదారులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేలా చూడాలన్నారు. జిల్లాలో సెప్టెంబర్ 13న జరగనున్న జాతీయ లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని న్యాయస్థానాల జ్యుడీషియల్ అధికారులు, న్యాయసేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నవంబర్ 30న వైజాగ్ మారథాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూ క్యాంపస్: వైజాగ్ రన్నర్స్ సొసైటీ ఆధ్వర్యంలో సంధ్య మెరైన్స్ సహకారంతో వైజాగ్ మారథాన్ నాల్గవ ఎడిషన్ నవంబర్ 30న జరగనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సోమవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 32 కి.మీ, 21 కి.మీ, 10 కి.మీ, 5 కి.మీ విభాగాల్లో పోటీలు ఉంటాయని, ఆసక్తి ఉన్నవారు వైజాగ్ మారథాన్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ పోటీలో పాల్గొనే వారందరికీ టీషర్ట్, మెడల్, ఎనర్జీ డ్రింక్, అల్పాహారం అందిస్తామన్నారు. సంధ్య మెరైన్స్ డైరెక్టర్ కె. ఆనంద్, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్, అపోలో హాస్పిటల్స్ సీవోవో శ్రీరామచంద్ర, దుద్దుపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా లిబరల్ పార్టీకి షోకాజ్ నోటీసు

మహారాణిపేట: గత ఆరేళ్లలో ఏ ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయని నమోదిత, గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆల్ ఇండియా లిబరల్ పార్టీకి కూడా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి ఎవరైనా సెప్టెంబర్ 8వ తేదీన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముందు హాజరై, అన్ని ఆధారాలతో రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.

నేడు కిరండూల్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మంగళవారం విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం(58501/58502) పాసింజర్‌ను ఇరువైపులా రద్దు చేశారు. ప్రయాణికులు ఈ మార్పును గమనించాలని సీనియర్ డీసీఎం కె.సందీప్ కోరారు.

నాణ్యత డొల్ల.. రోడ్లు గుల్ల

రెండు రోజుల వర్షానికే బట్టబయలైన డొల్లతనం



సిరిపురం వద్ద కుంగిన రోడ్డు



సింగ్ హోటల్ జంక్షన్ రోడ్డులో..



బీచ్‌రోడ్డులో ఏర్పడ్డ గొయ్యి

నగరంలోని ప్రధాన రహదారులు గుంతలతో మృత్యుకుహరాలను తలపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం చేపట్టిన పనుల్లో నాణ్యత ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఈ అధ్వానపు రోడ్లే సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని నగరవాసులు దుమ్మెత్తిపోస్తున్నారు. అత్యంత రద్దీ ప్రాంతాలైన సిరిపురం, పూర్ణామార్కెట్, రైల్వే న్యూకాలనీ, సింగ్ హోటల్ జంక్షన్ వంటి ప్రధాన కూడళ్లలో రోడ్లు కుంగి.. ప్రమాదకరంగా మారాయి. నిత్యం కిటకిటలాడే బీచ్ రోడ్డు, అల్లిపురం మెయిన్ రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఈ రోడ్లపై ప్రయాణించడం అంటే ప్రాణాలతో చెలగాటమాడటమేనని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లిపురం రోడ్డులో సోమవారం ఓ యువతి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం గుంతలో పడి అదుపుతప్పింది. అదృష్టవశాత్తూ ఆమె స్వల్ప గాయాలతో బయటపడింది. కేవలం రెండు రోజుల వర్షానికే రోడ్లు ఇలా కొట్టుకుపోతే.. ఇంకా భారీ వర్షాలు కురిస్తే ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



పూర్ణామార్కెట్ రోడ్డులో ఇదీ పరిస్థితి



అల్లిపురం మెయిన్‌రోడ్డులో యువతి పాట్లు

క్షేత్రస్థాయిలో శూన్యం.. కాగితాలపైనే వేగం

ఏమీ లేకుండా మేమేం చేయగలం?

- విశాఖ మెట్రో ప్రాజెక్ట్‌పై కన్సల్టెన్సీ అసహనం
- జిల్లా అధికారులతో సంప్రదింపులు జరిపిన 'శిస్త్రా'
- ప్రాజెక్ట్ పర్యవేక్షణ, సాంకేతిక సహకారంపై ఆరా
- భూసేకరణ మొదలు కాకపోతే రిపోర్ట్ ఎలా సిద్ధం చేయగలమని ప్రశ్నించిన సంస్థ
- టెండర్లు పిలవడంతో కూటమి ప్రభుత్వంపై విమర్శలు



మెట్రో రైల్ ప్రాజెక్టు డిజైన్



డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నమూనా

సాక్షి, విశాఖపట్నం: విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో 'అదిగో పులి..' అన్న చందంగా తయారైంది కూటమి ప్రభుత్వ వైఖరి. పనులకు క్షేత్రస్థాయిలో అంకురార్పణ జరగక ముందే అంతా సిద్ధమైనట్లుగా ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెడుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం భూసేకరణ ప్రక్రియను ప్రారంభించకుండా.. నిధులపై స్పష్టత ఇవ్వకుండానే టెండర్లు ఆహ్వానించి, జనరల్ కన్సల్టెంట్‌ను కూడా నియమించేశారు. ప్రాజెక్టు డిజైన్, నిర్వహణ, నాణ్యత పర్యవేక్షణ కోసం ఒప్పందం కుదుర్చుకున్న 'శిస్త్రా'సంస్థ ప్రతినిధులు ఇటీవల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. మెట్రో మార్గానికి సంబంధించిన వివరాలు, భూసేకరణ పురోగతిపై ఆరా తీయగా.. అధికారులు నీళ్లు నమలడం వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రాథమిక సమాచారం కూడా లేకుండా నిర్ణీత గడువులోగా నివేదికలు ఎలా సిద్ధం చేయగలమని.. 'ఏమీ లేకుండా మేమేం చేయగలం?'అంటూ శిస్త్రా సంస్థ ప్రతినిధులు నిస్సహాయత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

విశాఖ మెట్రో ప్రాజెక్టు పనులు 'మూడడుగులు ముందుకు.. ఆరడుగులు వెనక్కి' అన్నట్లు తయారైంది. ఆ మూడడుగులు కూడా కూటమి ప్రభుత్వ ప్రచార ఆర్భాటం తప్ప.. వాస్తవ పనుల్లో పురోగతి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది. నెల రోజుల కిందట తొలి దశలో 46.23 కిలోమీటర్ల మెట్రో ప్రాజెక్టుకు రూ.6,250 కోట్లతో(జీఎస్టీ అదనం) ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మూడేళ్లలో పనులు పూర్తి చేయాలని అందులో పేర్కొంది. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టును మొత్తం 140.13 కి.మీ మేర చేపట్టనుండగా.. తొలి దశలో 46.23 కిలోమీటర్ల మేర నిర్మించాలనుకుంటున్నారు. ఇందులో మొత్తం 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు రానున్నాయి. 20.16 కి.మీ డబుల్ డెక్కర్ తరహాలో ఫ్లైఓవర్లు నిర్మిస్తారు. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం, గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకు పై వంతెనల నిర్మాణం చేపడతారు. కొమ్మాది–స్టీల్‌ప్లాంట్, గురుద్వార–పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం–చినవాల్తేరు కారిడార్లలో తొలి దశ కింద మెట్రోకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కొమ్మాది–స్టీల్‌ప్లాంట్ మధ్య ఏర్పాటు చేసే 34.40 కిలోమీటర్ల కారిడార్‌లో డబుల్ డెక్కర్ ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కిమీ మేర రెండో కారిడార్‌ను నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ మధ్య మరొక కారిడార్ ఏర్పాటు చేయనున్నారు.

భూసేకరణ పూర్తికాకుండానే పనులెలా?

టెండర్లు ఖరారు చేశాక 30 నెలల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేస్తోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. కాగా.. రెండు నెలల కిందట సాంకేతిక సహకారం, ప్రాజెక్టు పర్యవేక్షణ, నాణ్యత పరిశీలన కోసం శిస్త్రా సంస్థతో ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా ఇటీవల జిల్లా యంత్రాంగం, మెట్రో అధికారులతో శిస్త్రా సంస్థ ప్రతినిధులు సమావేశమయ్యారు. ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ పనులు ఎంతవరకు వచ్చాయనే విషయంపై ఆరా తీశారు. అయితే ఇప్పటివరకు కేవలం ప్రజాభిప్రాయ సేకరణ మాత్రమే జరిగిందని తెలియడంతో శిస్త్రా ప్రతినిధులు విస్మయం వ్యక్తం చేశారు. టెండర్లు ఖరారయ్యేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు చెప్పడంపై వారు అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. రెండు దశలకు కలిపి మొత్తం 99.75 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, అందులో 9.22 ఎకరాల ప్రైవేట్ భూమి ఉంది. కొద్ది సమయంలో ఇంత పెద్ద ప్రక్రియ పూర్తి చేయడం అసాధ్యమని, కనీస సమాచారం లేకుండా తాము నివేదికలు ఎలా ఇవ్వగలమని శిస్త్రా సంస్థ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఒక కిలోమీటర్ ఫ్లైఓవర్ నిర్మాణానికే రెండేళ్లకు పైగా పడుతుంది. అలాంటిది.. 46 కి.మీ మార్గం, 42 స్టేషన్లతో కూడిన తొలి దశను రెండున్నరేళ్లలో ఎలా పూర్తి చేస్తారు?' అని వారు ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై పునరాలోచించుకోవాలని సలహా ఇచ్చినట్లు తెలిసింది. కేవలం ప్రచారం కోసమే.. క్షేత్రస్థాయిలో ఎలాంటి పురోగతి లేకుండా టెండర్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని కూటమి సర్కారుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ పాపం కూటమిదే..

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ పాపం కూటమి ప్రభుత్వానిదేనని వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆరోపించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్ కల్యాణ్ స్టీల్ ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించనివ్వబోమని హామీలిచ్చి అధికారంలోకి వచ్చారని, ఇప్పుడు ఆ హామీని విస్మరించి బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి తలొగ్గి, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం స్టీల్ ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టారని మండిపడ్డారు. సోమవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో 32 మంది త్యాగ ఫలమే విశాఖ స్టీల్ ప్లాంట్ అని కేకే రాజు గుర్తుచేశారు. అలాంటి పరిశ్రమలోని 32 విభాగాలను ప్రైవేటీకరించేందుకు టెండర్లు పిలవడం ఉక్కు కార్మికులను మోసం చేయడమేనని అన్నారు. కూటమి పార్టీలకు ఓటు వేస్తే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఖాయమని గతంలోనే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలను హెచ్చరించారని తెలిపారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగ సంఘాలు, ఉత్తరాంధ్ర ప్రజలు చేసిన పోరాటానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క కార్మికుడిని కూడా తొలగించలేదని, పైగా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్టీల్ ప్లాంట్ రుణాలను ఈక్విటీగా మార్చాలని కేంద్రాన్ని కోరుతూ లేఖ రాశారన్నారు. ఆనాడు పోరాటం చేసిన కార్మికులపై ఎలాంటి కేసులు పెట్టలేదని, ఉద్యోగులను తొలగించలేదని స్పష్టం చేశారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల్లోనే కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించారని, ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న 1,590 మందిని రెడ్‌మార్క్ చేసి, భవిష్యత్తులో ఉద్యమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారని ఆరోపించారు. కూర్మన్నపాలెంలో 1,300 రోజులుగా కార్మికులకు దీక్షకు వేదికగా నిలిచిన టెంట్‌ను కూడా ప్రభుత్వం తొలగించిందని, ఆందోళనలకు ఆస్కారం లేకుండా అక్కడే పోలీసును కూడా ఏర్పాటు చేసిందని విమర్శించారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, కార్మిక సంఘాలు, ప్రజలతో కలిసి వైఎస్సార్ సీపీ మరోసారి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ హాస్టళ్లలో ఉన్నత ప్రమాణాలు

మంత్రి డోలా ఆదేశం



మాట్లాడుతున్న మంత్రి వీరాంజనేయ స్వామి

కొమ్మాది: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చేరుతున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం, విద్య అందించడంలో ఉన్నత ప్రమాణాలు నెలకొల్పాలని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి అన్నారు. రుషికొండ దరి గీతం వర్సిటీలో ఉమ్మడి ఉత్తరాంధ్ర, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు, అధికారులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో సీట్ల భర్తీ, టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణత, హాస్టల్ భవనాల మరమ్మతులు, డైట్ బిల్లుల చెల్లింపు, పారిశుద్ధ్య నిర్వహణ, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం, వసతి తదితర అంశాలపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్యవేణి, కార్యదర్శి ఎం.ఎం.నాయక్‌లతో కలసి జిల్లాల వారీగా సమీక్షించారు. గత ఏడాది నీట్‌లో స్వల్ప తేడాతో సీట్లు పొందలేకపోయిన ఎస్సీ విద్యార్థుల కోసం లాంగ్ టెర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు మంత్రి తెలిపారు. హాస్టల్‌లో విద్యార్థులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా ఆరోగ్య తనిఖీలు చేయించాలన్నారు. హాస్టళ్ల అభివృద్ధిలో భాగంగా రూ.100 కోట్లతో 29 నూతన భవనాలు, రూ.58 కోట్లతో మరుగుదొడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. విశాఖ జిల్లా ఉపసంచాలకుడు కె.రామారావు, డీడీ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు శిక్షణ తరగతులు

పీఎంపాలెం: రాష్ట్ర ప్రభుత్వం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి సోమవారం ప్రారంభించారు. పరదేశిపాలెం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 8 నెలల పాటు ఈ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నెలకు రూ. 2.5లక్షల వేతనంతో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. మొదటి దశలో 75 మందికి అవకాశం ఉండగా, ప్రాథమికంగా ఆసక్తి చూపిన 29 మంది అభ్యర్థులు శిక్షణ తీసుకుంటున్నారని చెప్పారు.సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు.

కొత్త బార్లకు నోటిఫికేషన్ విడుదల

- జిల్లాలో జనరల్‌కు 121, గీత కులాలకు 10 కేటాయింపు



లాటరీ తీస్తున్న జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వం కొత్త బార్ పాలసీ ప్రకారం జిల్లాకు మొత్తం 131 బార్లను కేటాయించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి తెలిపారు. సోమవారం వీఎంఆర్డీఏ భవనంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. ఈ నెలాఖరుతో ప్రస్తుతం నడుస్తున్న బార్ల లైసెన్సులు ముగుస్తాయని చెప్పారు. కొత్తగా కేటాయించిన 131 బార్లలో.. 121 సాధారణ కేటగిరీకి, 10 గీత కులాలకు కేటాయించినట్లు వివరించారు. కొత్త బార్లకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలైందన్నారు. జనరల్ కేటగిరీ బార్లకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లేదా హైబ్రిడ్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆఫ్‌లైన్ దరఖాస్తులను వీఎంఆర్డీఏ భవనం (సిరిపురం)లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో నేరుగా సమర్పించాలని, ఈ నెల 28న వీఎంఆర్డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో డ్రా ద్వారా బార్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తుతో పాటు తిరిగి చెల్లించని(నాన్–రిఫండబుల్) ధరావత్తు సొమ్ముగా రూ.5 లక్షలు, అప్లికేషన్ ఫీజు రూ.10 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో బార్‌కు కనీసం 4 దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామని, లేకపోతే ఆ బార్‌కు డ్రా ఉండదని స్పష్టం చేశారు. బార్ లైసెన్స్ కోసం 50 వేలు జనాభా ఉంటే రూ.35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, రూ.5 లక్షలు దాటితే రూ.75 లక్షలు చెల్లించాలని చెప్పారు. లైసెన్సు ఫీజును ఒకేసారి కాకుండా ఆరు విడతల్లో చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు.

గీత కార్మికులకు 50 శాతం రాయితీ: గీత కార్మికులకు 10 బార్లను కేటాయించినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. ఇందులో శెట్టిబలిజలకు 6, యాతలకు 4 బార్లను లాటరీ ద్వారా కేటాయించినట్లు చెప్పారు. ఈ బార్లకు ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ఈ నెల 29 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. 30న డ్రా తీస్తామన్నారు. గీత కార్మికులకు లైసెన్స్ ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని, ఒకరు ఎన్ని బార్లకైనా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కాగా.. కొత్త బార్ పాలసీ ప్రకారం కొత్త బార్లకు మాత్రం ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు అనుమతి ఇచ్చారు. ఈ బార్లలో రూ.99 ధర కలిగిన చౌక మద్యం సరఫరా ఉండదని సూపరింటెండెంట్ తెలిపారు.

గీత కులాలకు 10 బార్లు : గీత కులంలోని ఉపకులాలకు 10 మద్యం బార్ల కేటాయింపు ప్రక్రియను చేపట్టారు. ప్రొహిబిషన్ అండ్ఎక్సైజ్ శాఖ అధికారులు, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ లాటరీ తీశారు.

ఆహార ప్రయోగం.. ఇంకెప్పుడు?

- ఆహార పరీక్షల కేంద్రం లేని రాష్ట్రం ఏపీ
- పరీక్షలకు ఇతర రాష్ట్రాలపై ఆధారం
- పరికరాల కోసం రూ.కోట్ల ఖర్చు
- ప్రారంభించి ఏడాదిన్నర అవుతున్నా అందని ఆహార ప్రయోగశాల సేవలు

బీచ్‌రోడ్డు: జీవనశైలి మార్పులతో పాటు కలుషితమైన ఆహారం నేటి తరంలో ఊబకాయం, క్యాన్సర్, షుగర్ వంటి వ్యాధులు పెరగడానికి ప్రధాన కారణమవుతోంది. బయటి ఆహారంపై ప్రజలు ఆధారపడటంతో, ఆహార భద్రత పర్యవేక్షణ అత్యంత కీలకంగా మారింది. అయితే ప్రజారోగ్యానికి భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఈ విషయంలో నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన స్టేట్ ఫుడ్ ల్యాబ్ ఇంకా అందుబాటులోకి రాకపోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

సొంత ల్యాబ్ ఎందుకు లేదు?


రాష్ట్ర విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి స్టేట్ ఫుడ్ ల్యాబ్‌ను మంజూరు చేసింది. విశాఖలోని పెదవాల్తేరు ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాల ప్రాంగణంలో దీనిని ఏర్పాటు చేశారు. ఈ ల్యాబ్ నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.30 కోట్లు ఖర్చు చేశాయి. రెండేళ్ల కిందటే భవన నిర్మాణం పూర్తయింది. 2024 ఫిబ్రవరి 25న ప్రధాని మోదీ వర్చువల్‌గా ఈ ల్యాబ్‌ను ప్రారంభించారు. అయితే దాదాపు ఏడాదిన్నర కాలం గడిచినా ఈ ల్యాబ్ సేవలు మాత్రం ఇప్పటికీ ప్రారంభం కాలేదు. దీంతో 11 ఏళ్లుగా సొంత ఆహార పరీక్ష కేంద్రం లేని ఏకైక రాష్ట్రంగా ఏపీ నిలిచింది. చిన్న రాష్ట్రాలకు సైతం సొంత ల్యాబ్‌లు ఉండగా, ఏపీ మాత్రం తెలంగాణపై ఆధారపడటం విమర్శలకు దారితీస్తోంది.

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రధాన మంత్రి ప్రారంభించిన కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చింది. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ల్యాబ్‌పై దృష్టి పెట్టలేదు. ఈ నిర్లక్ష్యంపై కూటమిలో భాగమైన బీజేపీ నాయకులు సైతం నిరసన వ్యక్తం చేస్తున్నారు. ల్యాబ్ సేవలను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే కోట్ల రూపాయలతో నిర్మించిన భవనం, అత్యాధునిక పరికరాలు నిరుపయోగంగా మారతాయని హెచ్చరిస్తున్నారు.

పరీక్షల కోసం కోట్ల వ్యయం

ఆహార భద్రత ప్రమాణాల శాఖ అధికారులు తనిఖీల్లో సేకరించిన నమూనాలను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. దీని వల్ల ఒక్కో నమూనాకు రూ.20 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. నెలవారీగా ఈ ఖర్చు సుమారు రూ. 5 కోట్లకు చేరుతుందని అంచనా. ఇటీవల విశాఖలో 20 బృందాలు తనిఖీలు చేసి పంపిన 79 నమూనాలకు సుమారు రూ.కోటి వ్యయం అవుతుంది. నమూనాలను ఇతర రాష్ట్రాలకు పంపడం వల్ల కమీషన్లు వస్తున్నాయని, అందుకే ఉన్నతాధికారులు ల్యాబ్ ప్రారంభం పట్ల నిర్లక్ష్యం చూపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.



నిరుపయోగంగా పరికరాలు



పెదవాల్తేరులో నిర్మించిన ఆహార ప్రయోగశాల

రూ.110 కోట్లు కేటాయించినా ప్రయోజనం శూన్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ ఆహార భద్రత కోసం రూ. 110 కోట్లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా మూడు ఆహార పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా విశాఖలో ఈ కేంద్రాన్ని నిర్మించింది. భవన నిర్మాణంతో పాటు సుమారు రూ. 10 కోట్ల విలువైన అత్యాధునిక పరికరాలను కూడా ఇక్కడ ఏర్పాటు చేశారు. అయినా.. ల్యాబ్ సేవలు అందుబాటులోకి రాలేదు.

మూలకు చేరిన పరికరాలు : ల్యాబ్‌లో ఆయిల్స్, పప్పులు, పాలు, పాల ఉత్పత్తులు, చాక్లెట్స్, బిస్కెట్స్, సాఫ్ట్ డ్రింక్స్ వంటి 17 రకాల ఆహార పదార్థాలను పరీక్షించేందుకు అవసరమైన 30 రకాల అత్యాధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయి. అయితే వీటిని పూర్తిగా ఇన్‌స్టాల్ చేయలేదు. ఈ ల్యాబ్ నిర్వహణకు అవసరమైన 70 మంది సిబ్బంది నియామక ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.

త్వరలో ఏబీజీ పరీక్షలు

సాక్షి ఎఫెక్ట్..

మహారాణిపేట: కింగ్ జార్జి ఆస్పత్రి(కేజీహెచ్)లో ఆర్టీ రియల్ బ్లడ్‌గ్లాస్(ఏబీజీ) పరీక్షలు నిలిచిన వ్యవహారంపై కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి స్పందించారు. సోమవారం సాక్షి దిన పత్రికలో 'రక్త 'పరీక్ష'లే..!'శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీంతో సూపరింటెండెంట్ వాణి రేడియాలజీ, ల్యాబ్ టెస్టులు నిర్వహించే సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. తక్షణం పరీక్షలు నిర్వహించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే స్థానికంగా కొనుగోలుచేసి ఏబీజీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

విశాఖపట్నం-రాయ్‌పూర్ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి పార్వతీపురం-సీతానగరం-బొబ్బిలి-డొంకినివలస సెక్షన్‌లో జరుగుతున్న మూడవ లైన్ సంబంధిత భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు, కొన్నింటి గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు.

రద్దు చేసిన రైళ్లు : ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్నం-రాయ్‌పూర్(58528) పాసింజర్, విశాఖపట్నం-కోరాపుట్(58537) పాసింజర్, విశాఖపట్నం-భవానిపట్న(58504) పాసింజర్, ఈ నెల 20వ తేదీ నుంచి 28వ తేదీ వరకు రాయ్‌పూర్-విశాఖపట్నం(58527) పాసింజర్, కోరాపుట్-విశాఖపట్నం(58537) పాసింజర్, భవానిపట్న-విశాఖపట్నం(58503) పాసింజర్‌లను రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు : ఈ నెల 19 నుంచి 26 వరకు గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. 20 నుంచి 27 వరకు రాయగడ-గుంటూరు (17244) ఎక్స్‌ప్రెస్ విజయనగరం నుంచి బయల్దేరుతుంది.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- ఈ నెల 22 నుంచి 29 వరకు దుర్గ్-విశాఖపట్నం (20829) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ 3 గంటలు ఆలస్యంగా ఉదయం 8.45 గంటలకు బయలుదేరుతుంది. ఇదే తేదీల్లో విశాఖపట్నం-దుర్గ్ (20830) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రెండున్నర గంటలు ఆలస్యంగా సాయంత్రం 5.20 గంటలకు బయలుదేరుతుంది.
- ఈ నెల 19న నాందేడ్-సంబల్‌పూర్(20810) నాగావళి ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా రాత్రి 8.30 గంటలకు బయలుదేరుతుంది.
- ఈ నెల 20, 21, 23, 24, 26వ తేదీల్లో విశాఖపట్నం-నిజాముద్దీన్(12807) సమతా ఎక్స్‌ప్రెస్ 5 గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 2.20గంటలకు బయలుదేరుతుంది.

వర్షం ఆగి.. వెతలు మిగిలి

వాయు'గండం' గడిచింది!

- ఒడిశాలోని గోపాల్‌పూర్ వైపు వెళ్లిన అల్పపీడనం
- రెండు రోజుల్లో.. రికార్డు స్థాయిలోవర్షం
- భీమిలిలో అత్యధికంగా 170.75 మి.మీ.
- జిల్లాలో 12 చోట్ల 100 మి.మీ.కు పైగా వర్షపాతం నమోదు
- కొబ్బరితోటలో కూలిన ఇంటి శ్లాబ్.. ఒకరికి గాయాలు




పూర్ణామార్కెట్ టౌన్‌కొత్తరోడ్డులో నిలిచిన వర్షపు నీరు (ఇన్‌సెట్) దుర్గాలమ్మ గుడి వద్ద పరిస్థితి

17వ తేదీ ఉదయం 8.30 నుంచి 18వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకూ జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు

ప్రాంతం	వర్షపాతం (మి.మీ.లలో)
భీమిలి	170.75
సాగర్‌నగర్	168.25
ఆనందపురం	165.00
పెదగంట్యాడ	150.25
పెందుర్తి	145.50
జాలారిపేట	133.25
గాజువాక	133.25
పీలానగర్	117.25
గోపాలపట్నం	119.75
మహారాణిపేట	119.25
సీతమ్మధార	118.0
అక్కిరెడ్డిపాలెం	112.75

సాక్షి, విశాఖపట్నం: భారీ వర్షం రెండు రోజుల పాటు మహానగరాన్ని ముంచెత్తింది. విశాఖ తీరానికి సమీపంలో ఏర్పడిన అల్పపీడనం అలజడి రేపింది. వాయుగుండంగా బలపడే అవకాశం ఉండటంతో.. రెడ్ అలెర్ట్ జారీ చేసినా.. చివరికి వరుణుడు కరుణించడంతో.. వర్షం తగ్గుముఖం పట్టింది. అల్పపీడనం క్రమంగా బలపడుతూ ఒడిశాలోని గోపాల్‌పూర్ వైపు కదలడంతో.. విశాఖ ఊపిరి పీల్చుకుంది. సోమవారం మధ్యాహ్నం వరకూ మోస్తరు వర్షం కురిసింది. పెందుర్తి మండలం అక్కిరెడ్డి పాలెంలో అత్యధికంగా 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, సీతమ్మధారలో 31, మహారాణిపేటలో 28.5, గాజువాకలో 25.25, పెదగంట్యాడలో 24.5, గురుద్వారలో 24.3, పెందుర్తిలో 23.5, హెచ్‌బీ కాలనీలో 23.25 మిమీ వర్షపాతం నమోదైంది. మధ్యాహ్నం తర్వాత వాతావరణం తెరిపినివ్వడంతో ప్రజలు సాధారణ పనుల్లో నిమగ్నమైపోయారు. అయితే.. రెండు రోజుల పాటు రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. జిల్లాలోని 12 చోట్ల 100 మిమీకి పైగా వర్షపాతం నమోదు కావడం విశేషం. మరో రెండు రోజుల పాటు తేలికపాటి జల్లులు తప్ప భారీ వర్షాలకు అవకాశం లేదని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం స్పష్టం చేసింది.

దాబాగార్డెన్స్: నగరంలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా తలెత్తే సమస్యల పరిష్కారానికి జీవీఎంసీ అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని కమిషనర్ కేతన్ గార్గ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తనతోపాటు మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, అధికార యంత్రాంగం నిరంతరం ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటోందన్నారు. రాపిడ్ యాక్షన్ రెస్పాన్స్ టీమ్స్ ద్వారా సమస్యల్ని సత్వరమే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గెడ్డలు పరిశీలించి, వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకాల్లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. శిథిలావస్థ భవనాలు, కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు రక్షణ కల్పించే దిశగా వారిని జీవీఎంసీ సామాజిక భవనాలు, పాఠశాలల్లో ఆశ్రయం కల్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. బలమైన గాలులకు హోర్డింగ్‌లు కూలిపోయే ప్రమాదం ఉన్నందున వాటిని తొలగించే ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయం సందర్భాల్లో తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ట్యాంకర్లను సిద్ధం చేశామన్నారు. వర్షాల వల్ల వ్యాపించే వ్యాధుల నివారణకు సరిపడా క్లోరిన్ లిక్విడ్, ఆలం నిల్వ ఉంచినట్లు వెల్లడించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

అన్ని జోనల్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను ప్రధాన కార్యాలయంలో ఉన్న సిటీ ఆపరేషన్ సెంటర్ ద్వారా సంబంధిత అధికారులకు చేరవేసి, చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ వెల్లడించారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఎదురైనా జీవీఎంసీ కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెం.1800 4250 0009ను సంప్రదించవచ్చన్నారు. ఇప్పటి వరకు జీవీఎంసీ కమాండ్ కంట్రోల్ నెంబర్‌కు 97 ఫిర్యాదులు రాగా, 94 ఫిర్యాదుల్ని పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ దీపాల సమస్యల పరిష్కారానికి 280 మంది ఎలక్ట్రికల్ సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు.

కూలిన శ్లాబ్.. ఒకరికి గాయం

అల్లిపురం: గత రాత్రి కురిసిన భారీ వర్షానికి జీవీఎంసీ 34వ వార్డు కొబ్బరితోట, ఎస్‌వీపీ నగర్‌లో ఒక ఇంటి పైకప్పు కూలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఉమ్మిడి గురుమూర్తికి చెందిన ఇంట్లో ఓ కుటుంబం అద్దెకు ఉంటోంది. తాజాగా కురిసిన భారీ వర్షానికి ఇంటి శ్లాబ్ కూలిపోయింది. స్వామి అనే దివ్యాంగుడు గాయపడగా, 80 ఏళ్ల వృద్ధురాలు తప్పించుకుంది. ఇంట్లో ఉన్న సామాన్లన్నీ పాడయ్యాయి. ఎన్టీఆర్ ప్రభుత్వంలో జీ+1 కేటగిరీలో స్కీమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరాయి. జోన్-4 జెడ్సీ సోమవారం వార్డులో పర్యటించి, ఇళ్లు ఖాళీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



శ్లాబ్ కూలిన ఇల్లు(ఇన్‌సెట్) గాయపడిన దివ్యాంగుడు స్వామి

ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ మ్యూజియం

కైలాసగిరిపై త్రిశూలం ఏర్పాటుకు శంకుస్థాపన

ఏయూ క్యాంపస్: విశాఖ నగరానికి వచ్చే సందర్శకులను మరింత అలరించేలా హెలికాప్టర్ మ్యూజియంను బీచ్‌రోడ్డులో అందుబాటులోకి తీసుకువచ్చారు. సోమవారం సాయంత్రం ఇన్‌చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ప్రారంభించారు. దాదాపు రూ.3.5 కోట్ల వ్యయంతో దీనిని ఏర్పాటు చేశారు. భారత నావికాదళంలో విశేష సేవలు అందించి, విధుల నుంచి విరమణ పొందిన యుహెచ్3హెచ్ హెలికాప్టర్‌ను మ్యూజియంగా మార్చుచేసి, ప్రజల సందర్శనకు ఉంచారు. కార్యక్రమంలో నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు భవానీ శంకర్, మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



త్రిశూలం నమూనా



హెలికాప్టర్ మ్యూజియం ప్రారంభోత్సవంలో మంత్రులు బాలవీరాంజనేయ, అనిత, ఎమ్మెల్యేలు, అధికారులు

కైలాసగిరిపై 55 అడుగుల త్రిశూలం

ఆరిలోవ: నగరంలో ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిపై డమరుకంతో కూడిన త్రిశూలం ఏర్పాటుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోల శ్రీబాల వీరాంజనేయ, హోంమంత్రి అనితలు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి బాల వీరాంజనేయ మీడియాతో మాట్లాడుతూ విశాఖ నగరంలో పర్యాటకాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా కైలాసగిరిపై రూ.1.55 కోట్లతో 55 అడుగుల ఎత్తైన త్రిశూలాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నాకవుట్‌కు వారియర్స్.. టోర్నీ నుంచి లయన్స్, రాయల్స్ ఔట్

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్‌లో భాగంగా వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తుంగభద్ర వారియర్స్ నాలుగు వికెట్ల తేడాతో విజయవాడ సన్‌షైనర్స్‌పై గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన సన్‌షైనర్స్ ఏడు వికెట్లకు 161 పరుగులు చేసింది. ప్రతిగా తుంగభద్ర వారియర్స్ మరో ఓవర్ ఉండగానే ఆరు వికెట్లకు 167 పరుగులతో లక్ష్యాన్ని చేరుకుంది. దీంతో ఏపీఎల్ నాలుగో సీజన్‌లో ఆరు మ్యాచ్‌లు ఆడి నాలుగు విజయాలు, రెండు పరాజయాలతో నాకవుట్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. నాకవుట్‌లో స్థానం కోసం బుల్స్‌తో కింగ్స్ తలపడనుంది. ఆరు మ్యాచ్‌ల్లో రెండు వర్షార్పణం కాగా ఒక విజయం, మూడు పరాజయాలతో ఇంటి బాట పట్టిన తొలి జట్టుగా సింహాద్రి వైజాగ్ లయన్స్ నిలిచింది.

రాయలసీమ రాయల్స్ ఓటమి

రెండో మ్యాచ్‌లో అమరావతి రాయల్స్ ఏడు వికెట్ల తేడాతో రాయలసీమ రాయల్స్‌పై విజయం సాధించింది. 162 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన అమరావతి రాయల్స్ తరఫున కెప్టెన్ హనుమవిహారీ 47 పరుగులు చేయగా కరణ్‌షిండ్(56),సందీప్(23) అజేయంగా నిలిచి జట్టుకు విజయాన్నందించారు. ఈ పరాజయంతో రాయలసీమ రాయల్స్ జట్టు ఆరు మ్యాచ్‌ల్లో మూడే పాయింట్లతో టోర్నీ నుంచి వైదొలిగింది.

చేపల వేటకు వెళ్లిన యువకుడి గల్లంతు

ఎంవీపీకాలనీ: చేపల వేటకు వెళ్లిన జాలరి ఎండాడకు చెందిన పిల్లా సతీష్ అనే యువకుడు సముద్ర తీరంలో గల్లంతైనట్లు గ్రామస్తులు వెల్లడించారు. వివరాలిలా.. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తుండగా.. సోమవారం ఉదయం సముద్ర తీరంలో చేపల వేటకు సతీష్ వెళ్లాడు. వర్షం కురిసే సమయంలో సముద్ర తీరంలో చేపలు విరివిగా దొరుకుతాయనే ఆశతో సతీష్ తరచూ వలతో చేపల వేట చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం కూడా అదే మాదిరిగా చేపల వేట సాగిస్తుండగా భారీ అల రావడంతో అదుపుతప్పి సముద్రంలోకి వెళ్లిపోయాడు. దీన్ని అక్కడే ఉన్న కొందరు గమనించి ఈదుకుంటూ వచ్చేస్తాడని ఆశించినా ఎంతసేపటికీ సతీష్ రాలేదు. అనంతరం ఎంవీపీ పోలీసులకు సమాచారం అందించారు. తీరం వెంబడి పలు బోట్లలో సోమవారం సాయంత్రం వరకు వెతికినా సతీష్ ఆచూకీ లభించలేదు.

నిరుద్యోగ ఎస్సీ యువతకు డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ

మహారాణిపేట: నిరుద్యోగ ఎస్సీ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వి.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. ప్రధానమంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ యోజన పథకంలో భాగంగా 10వ తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 45 ఏళ్ల వయసున్న ఎస్సీ అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మూడు నెలల కాలంలో ఈ శిక్షణ పూర్తి అవుతుందని, శిక్షణానంతరం, సంబంధిత రంగాల్లో ప్రైవేట్ ఉద్యోగాలు పొందేందుకు సహాయం చేస్తామన్నారు. మహారాణిపేటలోని నేక్ శిక్షణ కార్యాలయంలో శిక్షణ తరగతులు ఉంటాయని, మరిన్ని వివరాలకు 79895 72891 లేదా 90597 99194 నంబర్లను సంప్రదించవచ్చని రవికుమార్ కోరారు.

గ్రంథాలయాల అభివృద్ధిపై సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ అధీనంలోని వివిధ శాఖా గ్రంథాలయాలకు రూ.6 లక్షలతో ఆన్ డిమాండ్ పుస్తకాల కొనుగోలు నిమిత్తం పరిపాలనా ఆమోదం లభించింది. జాయింట్ కలెక్టర్ పి.మయూర్ అశోక్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా గ్రంథాయల సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. మహారాణిపేటలోని స్థలంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయానికి నూతన భవన నిర్మాణం కోసం డిజైన్‌తో రూ.37.95 కోట్లు ఖర్చవుతుందని ఏపీ విద్యా, సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ఎస్టిమేషన్ ఇచ్చారు. వీటిని పరిశీలించి ప్రభుత్వానికి పంపేందుకు తీర్మానం ఆమోదించారు. వాడచీపురుపల్లిలో నూతన భవన నిర్మాణం కోసం రూ.25.లక్షల వరకు ఖర్చవుతుందని వచ్చిన ప్రతిపాదనలపై చర్చించారు. సమావేశంలో విద్యా శాఖ ఎ.డి.గోపీకృష్ణ, వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్య వర్మ, జిల్లా పంచాయతీ శాఖ ఏవో సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో శిక్షణ

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో పది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. 21 ఏళ్లు నిండి 55 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. మధ్యాహ్న భోజనంతో పాటు స్టేషనరీ ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 93948 85164 నంబర్‌లో సంప్రదించవచ్చు.

రోడ్డు ప్రమాదంలో యువతీ యువకుల దుర్మరణం



ప్రమాద స్థలిలో మరణించిన సంతోష్, ఉష

పీఎం పాలెం: బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో యువతీ యువకులు దుర్మరణం చెందారు. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా హైవేపై చోటుచేసుకున్న ఈ దుర్ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు. నగర పరిధిలోని జోడుగుళ్లపాలేనికి చెందిన వాసుపల్లి దాసుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు వాసుపల్లి సతీష్(19) భవన నిర్మాణ సెంట్రింగ్ పనులు చేస్తుంటాడు. అప్పుడప్పుడు చేపలుప్పాడలో ఉంటున్న తాతగారి ఇంటికి వెళ్తుంటాడు. పలాసకు చెందిన ఉష(18)తో యువకుడికి పరిచయం ఉంది. తనను కలుసుకోవడానికి వచ్చిన ఆమెతో బైక్‌పై పలు ప్రాంతాల్లో తిరిగారు. ఈ క్రమంలో తాతగారి ఇంటి నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లేందుకు వీరిద్దరూ బైక్‌పై పరదేశిపాలెం మీదుగా బయల్దేరారు. చంద్రంపాలెం హైస్కూల్ ఎదురుగా హైవేపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న బస్సు, లారీలను తప్పించబోయి లారీకి బైక్ తగలడంతో కింద పడిపోయారు. ఇద్దరికీ తలకు బలమైన గాయాలై సంఘటనా స్థలిలోనే మరణించారు. మృత దేహాలను పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ రాము తెలిపారు.

అర్జీలు పునరావృతమైతే అధికారులదే బాధ్యత

- కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్
- పీజీఆర్ఎస్‌లో 173 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో రెవెన్యూ విభాగానికి సంబంధించినవే ఎక్కువగా ఉన్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఈ సోమవారం పీజీఆర్ఎస్‌కు తక్కువ ఫిర్యాదులు వస్తాయనుకున్నారు. వచ్చిన 173 ఫిర్యాదుల్లో 66 రెవెన్యూ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. పోలీస్ శాఖకు సంబంధించి 10, జీవీఎంసీవి 50 ఉన్నాయి. ఇతర విభాగాలకు సంబంధించి 47 వినతులు వచ్చాయి.

24 గంటల్లో వినతులు పరిష్కరించాలి

పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను 24 గంటల్లోపు ఓపెన్ చేసి, పునరావృతం కాకుండా సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్జీలు పునరావృతమైతే అధికారులదే బాధ్యత అని హెచ్చరించారు. తన కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యను తెలుసుకుని, పరిష్కారానికి భరోసానిచ్చారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి వినతులు స్వీకరించారు. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు వర్షం ఎఫెక్ట్

వచ్చిన అర్జీలు కేవలం 54



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, కమిషనర్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నాటి పీజీఆర్ఎస్‌కు వర్షం ఎఫెక్ట్ కనిపించింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు కేవలం 54 వినతులు మాత్రమే అందాయి. వీటిని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అన్ని జోనల్ కార్యాలయాల నుంచి వచ్చిన వినతుల్లో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానివే 33 అర్జీలున్నట్లు తెలిపారు. అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 3, ఇంజినీరింగ్ సెక్షన్‌కు 9, మొక్కల విభాగానికి ఒక ఫిర్యాదు వచ్చినట్లు వెల్లడించారు. అనంతరం కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు వెంటనే వాటిని పరిశీలించి, అర్జీదారులతో సంప్రదించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రధాన ఇంజినీరు పల్లంరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, సీసీపీ ప్రభాకరరావు, డీసీఆర్ శ్రీనివాసరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ డీజీఎం ఇంట్లో చోరీ

24 గంటల్లోనే నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ లతామాధురి చిత్రంలో సీఐ శ్రీనివాసరావు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంట్ డీజీఎం ఇంట్లో చోరీ చేసిన నిందితుడిని 24 గంటల్లో పట్టుకున్నామని డీసీపీ లతామాధురి చెప్పారు. గాజువాక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్ సెక్టార్-6, క్వార్టర్ నెం.105-బిలో స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ డీజీఎం నల్లి సుందరం కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఈ నెల 16న ఆయన తన భార్యతో కలసి మధ్యాహ్నం 12.15 గంటలకు ఒక ఫంక్షన్ వెళ్లారు. తిరిగి 1.50 గంటలకు ఇంటికి వచ్చారు. మెయిన్ డోర్, ఫస్ట్ ఫ్లోర్ డోర్ తాళాలు పగులగొట్టి ఉండడాన్ని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా లాకర్ కూడా విరగ్గొట్టి ఉండడంతో అందులో ఉన్న 24 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీన్ని సవాల్‌గా తీసుకున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ కె.లతామాధురి ఆదేశాల మేరకు సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం రంగంలోకి దిగింది. ఈ బృందం సాంకేతిక ఆధారాలతో కేవలం 24 గంటల్లోనే నిందితుడు మాటూరి శ్రీను(30)ను అరెస్టు చేసింది.

చోరీ సొత్తు రికవరీ : నిందితుడి నుంచి పోలీసులు బంగారు గాజులు పది, బ్రేస్‌లెట్లు నాలుగు, చెవులీలు 23 జతలు, ఒక చెయిన్, నాలుగు జతల చెవి దిద్దులు, ఆరు ఉంగరాలు, మూడు లాకెట్స్, నల్లపూసల దండ ఒకటి కలిపి మొత్తం 24 తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. నిందితుడి నుంచి మోటర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మాటూరి శ్రీను పాత నేరస్తుడని డీసీపీ లతామాధురి తెలిపారు. అగనంపూడి ఉప్పర కాలనీకి చెందిన శ్రీనుపై 2021లో అచ్యుతాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం కేసు ఉందన్నారు. ప్రస్తుతం నిందితుడు శ్రీకాకుళం జిల్లా బూర్జలోని అత్తారింట్లో ఉంటూ కొబ్బరికాయలు దింపే పని చేస్తున్నాడని పేర్కొన్నారు. చెడు అలవాట్లకు బానిస కావడంతో చోరీలు చేస్తున్నట్లు తెలిపారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి

విశాఖ సిటీ: టెక్ మహీంద్రా ఫౌండేషన్ సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల వారు ఎన్ఏడీ ప్రాంతంలో ఉన్న నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ, 99081 04113, 63041 59549 నంబర్లలో గానీ ఈ నెల 23లోగా సంప్రదించాలని సూచించారు.

ఫొటోగ్రాఫర్ అగర్వాల్‌కు అంతర్జాతీయ గౌరవ పురస్కారం



ఏయూక్యాంపస్: నగరానికి చెందిన ఫొటోగ్రాఫర్ బి.కె.అగర్వాల్‌కు అమెరికాకు చెందిన ఇమేజ్ కొలీగ్ సొసైటీ గౌరవ పురస్కారాన్ని ప్రకటించింది. ఫొటోగ్రఫీ రంగంలో చేస్తున్న కృషిని గుర్తిస్తూ అగర్వాల్‌ను ఎంపిక చేసింది. ఈ పురస్కారాన్ని డిసెంబర్ 1న విజయవాడలో జరిగే ఒక ప్రత్యేక కార్యక్రమంలో అగర్వాల్‌కు అందజేయనున్నారు. ఈ సందర్భంగా బి.కె.అగర్వాల్ మాట్లాడుతూ ఫొటోగ్రఫీలో తన ప్రతిభను గుర్తించడంపై, ఈ ప్రయాణంలో తనతోపాటు ప్రయాణించిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం మరింత ప్రేరణ అందిస్తుందన్నారు.

సీఎం, ప్రతిపక్ష నాయకుల దృష్టికి ఈవోఐ అంశం



మాట్లాడుతున్న రాజశేఖర్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విస్తృతంగా విడుదల చేసిన ఆసక్తి వ్యక్తీకరణ(ఈవోఐ)లు, తద్వారా జరగబోయే నష్టాలను ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులను కలిసి వివరించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు నిర్ణయించారు. స్థానిక గుర్తింపు యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ అమరావతికి వెళ్లి సీఎంను, స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు, నాయకులను కలిసి సమస్యలను వివరించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఢిల్లీ వెళ్లి కేంద్ర ఉక్కు మంత్రి, సహాయ మంత్రిని కలవాలని ప్రతిపాదించారు. ఈవోఐ అంశంపై నగరంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. అవసరమైతే ఈ అంశంపై సమ్మెకు వెళ్లడానికి సమాయత్తం కావాలని కొంత మంది నాయకులు ప్రతిపాదించారు. సమావేశంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కె.ఎస్.ఎన్.రావు, జె.అయోధ్యరామ్, డి.వి.రమణారెడ్డి, జి.గణపతి రెడ్డి, జి.ఆర్.కె.నాయుడు, బి.డేవిడ్, వరసాల శ్రీనివాస్, నమ్మి సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.